www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 4 ఆగస్టు 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అర్జీదారుల వినతులను స్వీకరిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాలలోను, 4 మునిసిపల్ ప్రధాన కార్యా లయాల లోనూ 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధి కారులు ప్రజలకు అందు బాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తార న్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవి ధంగా అర్జీదారులు తమ అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతు లు సంబంధిత సమాచారం తెలుసుకు నేందుకు 1100 కి నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

యాప్‌లతో యాతన

- పనిభారం..అరకొర వేతనం
- సరిగా పనిచేయని మొబైల్ ఫోన్లు
- సాంకేతిక సమస్యలతో యాప్‌లో నమోదు కాని లబ్ధిదారుల వివరాలు
- పనిభారంతో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కుంటున్న అంగన్‌వాడీలు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా సెల్‌ఫోన్లను ఇచ్చేస్తున్న అంగన్‌వాడీలు



కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా (ఫైల్ ఫోటో)

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీ ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలతో కార్యకర్తలు, లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. సర్వర్ సమస్య కారణంగా ఆయా యాప్లు తరచూ మొరాయిస్తున్నాయి. రెండు కాకుండా ఒకే యాప్లో వివరాల నమోదు చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తే పరిస్థితి కొంత చక్కబడే అవకాశముంది. దీనిని ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో నేడు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీలు అంతా తమకు ఇచ్చిన 2 జి నెట్ వర్క్ ఫోన్లను తిరిగి ఇచ్చేసి నిరసన తెలియజేస్తున్నారు.

ప్రజాశక్తి - రాజోలు

యాప్‌ల నిర్వహణతో ప్రభుత్వ, స్కీమ్ ఉద్యోగులు, సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. తమపై యాప్‌ల భారాన్ని తొలగించాలంటూ అంగన్‌వాడీ తదితర చిరు ఉద్యోగులు డిమాండ్‌చేస్తున్నారు.జిల్లాలో 17,19,013 మంది జనాభా ఉన్నారు. కాగా వారిలో అత్యధికులు ప్రభుత్వం యాప్‌ల నిర్వహణలో బాధితులే. ఏదో రూపంలో వారి నుంచి సర్వేల ద్వారా వ్యక్తిగత వివరాలను సేకరిస్తుండటంతో ఎప్పుడు ఏ లబ్ధి ఎగిరిపోతుందోనంటూ ఆందోళనలో ఉన్నారు. ఇక స్కీమ్ ఉద్యోగులు పనిభారంతో అల్లాడుతున్నారు. జిల్లాలో 7 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,726 మెయిన్, మినీ అం గన్‌వాడీ కేంద్రాలుండగా 86,296 మంది చిన్నారులు, 15,743 మంది గర్భిణులు, బాలింతలు ఉండగా, 1,396 మంది ఆశాలు పని చేస్తున్నారు. 165 ప్రయివేటు ఆసుపత్రులున్నాయి. ఆయా సంస్థల్లో ఆరోగ్య పరమైన యాప్‌ల నిర్వహణతో సిబ్బంది పనిభారాన్ని మోస్తున్నారు.

ఫేస్ రికగ్నేషన్ సిస్టంతో యాతన

ఐసిడిఎస్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)తో అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ సరిగా పనిచేయక పోవడంతో ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తవడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు గుడ్లు, పాలతో పాటు మరికొన్ని పౌష్టికాహార పదార్థాలను అందజేస్తున్నారు. ఆయా వివరాలను రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోని బాల సంజీవిని యాప్‌లో, కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని పోషణ ట్రాకర్‌లో ఫేస్ రికగ్నిషన్ సిస్టం యాప్ ద్వారా నమోదు చేయాలని ప్రభుత్వం చెబుతోంది. లబ్ధిదారుల మొబైల్ నుంచి వచ్చే ఒటిపితో వివరాలు ఖరారు చేయాలి. ఆ ప్రక్రియను సాగించేందుకు తగిన సాంకేతిక పరికరాలను కానీ, సమయాన్ని కానీ కూటమి ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ముందుగా ఫీడ్ చేసిన లబ్ధిదారుల ఫొటో ఎలా ఉండేదో వర్తమానంలో కూడా అచ్చుగుద్దినట్టు ఉంటేనే యాప్‌లో వివరాలు నమోదవుతున్నాయి. అంగన్‌వాడీలకు ప్రభుత్వం తరఫున అప్‌డేటెడ్ సెల్‌ఫోన్లను ఇవ్వకపోవడంతో వారి సొంత ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకుని యాప్‌లను వాడాల్సి వస్తుంది.ప్రభుత్వం నామమాత్రంగా ఇస్తున్న 2 జీబీ డేటా సరిపోకపోవడం, నెట్ సిగ్నల్స్ 5జీ కాకపోవడం లబ్ధిదారులను, అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతుంది.

పెరిగిన పనిభారం

వేతనం, పారితోషికం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వం తమపై పనిభారం పెంచుతోందని అంగన్‌వాడీ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త యాప్లను తమపై రుద్ది సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ వాటి ఆధారంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ చేయాలని అంగన్ వాడీ వర్కర్లలకు పని భారం మోపారు. ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు పిల్లల బరువును పరిశీలించాలని, రికార్డు రాయడం, టేక్ హెూమ్ రేషన్ పంపిణీ, యాప్ల ద్వారా ప్రభుత్వం కోరిన సమాచారం ఇవ్వడం వంటి విధులు నిర్వహిస్తున్నామని, పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కూడా తమపైనే రుద్దుతున్నారని వారు అంటున్నారు. హెల్పర్లు కేంద్రాన్ని శుభ్రం చేయడం, పోషకాహారాన్ని వండి పెట్టడం, గిన్నెలు శుభ్రం చేయడం, పిల్లల వాష్రఉముల శుభ్రపరచడం వంటి పనులు చేస్తున్నారని, వీరికి కేవలం రూ.7వేలు వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. రోజంతా పనిభారంతో ఒత్తిడికి గురవుతున్న వర్కర్లకు రూ.11,500 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. బాలసంజీవని యాప్పు సవరణ చేయాలని, సమాన వేతనాలు అమలు చేయాలని, గ్రామాల్లో పింఛన్ల పంపిణీ నుంచి అంగన్‌వాడీ సిబ్బందిని మినహాయించాలని, పనిభారం తగ్గించాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కొత్త టెక్నాలజీతో కూడిన 5జీ మొబైల్ ఫోన్లు అందజేయాలని,ఇంటర్ నెట్ ఛార్జీలు చెల్లించాలని కోరుతున్నారు.

15 రకాల రికార్డులు నిర్వహించాలి

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. దీని వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. యాప్లతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఇచ్చిన సెల్‌ఫోన్లు, నెట్ వర్క్ పనిచేయకపోవడంతో ఐదారుసార్లు తిరగాల్సి వస్తోంది.

షరతులు తొలగించాలి



అంగన్‌వాడీలో సరుకులు పొందడానికి ఆన్‌లైన్ ఫొటో అప్లోడ్ కావాలని చెప్పడం వల్ల పనికిరాని సెల్‌ఫోన్లు, నెట్‌వర్క్ అందక గంటల తరబడి కేంద్రాల్లో ఎదురుచూడాల్సిన పరిస్థితి. దీనివల్ల లబ్ధిదారులు, అంగన్‌వాడీ వర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన పెంచటానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోకుండా, ఆన్‌లైన్ పేరుతో ఐసిడిఎస్ సిబ్బందిని ప్రజల దగ్గరికి వెళ్లకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఆన్‌లైన్ వ్యవస్థను రద్దుచేసి లబ్ధిదారులు సంతకాలు వేలిముద్రలతో స్వేచ్ఛగా కేంద్రాలకు వచ్చి సరుకులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి. ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించి పాత విధానాన్ని కొనసాగించాలి.

- కె.కృష్ణవేణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు

తల్లీపిల్లల హత్యలతో కలకలం

- ఉలిక్కిపడ్డ సామర్లకోట
- అలముకున్న విషాద ఛాయలు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి బిందుమాధవ్

ప్రజాశక్తి - సామర్లకోట

ఇద్దరు ఆడపిల్లలు సహా తల్లి దారుణ హత్యలతో సామర్లకోటలో తీవ్ర కలకలం రేగింది. అగంతకులు ముక్కుపచ్చలారని చిన్నారులను పొట్టన పెట్టుకున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సామర్లకోట పట్టణం సీతారామ కాలనీలో తల్లితో సహా ఇద్దరు ముక్కు పచ్చలారని ఆడ పిల్లలు దారుణ హత్యకు గురయ్యారు. ఈ సంఘటనతో సీతారామ కాలనీలో ఆదివారం తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని సీతారామ కాలనీలో ఆదివారం తెల్లవారు జామున నైట్ డ్యూటీ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వచ్చిన ధను ప్రసాద్ భార్యను ఎంత పిలిచినా బయటకు రాలేదు. దీంతో గోడదూకి చూడగా భార్య ములపర్తి మాధురి(26), కుమార్తెలు నిస్సి (8), ప్రైజీ (6) రక్తపుమడుగులో మరణించి ఉండటాన్ని గుర్తించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో తల్లి ఇద్దరు పిల్లల మృతదేహాలు వేరువేరు చోట్ల తలపై పదునైన గాయంతో హతమార్చినట్టు పడి ఉన్నాయి. భర్త ధనుప్రసాద్ రాత్రి విధులు ముగించుకుని ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటికి రాగా హత్యకు గురైన తన భార్య పిల్లలను చూసి రోధిస్తున్న తీరు చూపర్లను కలచివేసింది. ఆగంతకులు తొలుత భార్య మాధురిని హతమార్చి, అనంతరం ఇద్దరు చిన్నారులను పాశవికంగా హతమార్చినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటనలో ధనుప్రసాద్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

దర్యాప్తు అనంతరం వివరాలు : ఎస్‌పి

స్థానిక సీతారామ కాలనీలో మూడు హత్యలు జరిగిన సంఘటనా స్థలాన్ని ఎస్‌పి బిందుమాధవ్ పరిశీలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి శ్రీహరిరాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు హత్యల సంఘటనా సమాచారం వచ్చిందని, దీంతో పూర్తి వివరాలను సేకరిస్తున్నామని, హత్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అన్నారు.

అందరి సహకారంతో ఎడ్యుకేషన్ హబ్‌గా కోనసీమ

ప్రజాశక్తి - అమలాపురం

కోనసీమ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు అందరూ సహకారంతోనే విజయవాడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మోకా సత్తిబాబు పిలుపునిచ్చారు. శ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ద్వారా పోలీసు ఉద్యోగాలు సాధించిన 14 మందికి అభినందన సభను అమలాపురం లోని ఒక ప్రయివేట హోటల్ ఆడిటోరియం నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్తిబాబు ముఖ్య అతిధి గా పాల్గొని ప్రసంగించారు.ఉద్యోగాలు సాధించిన మీ అందరూ సొసైటీ కి మళ్ళీ ఎంతోకొంత పేదలకు ఉపయోగపడాలన్నదే శ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ఉద్దేశ్యమని అన్నారు. వచ్చే సంవత్సరం నుండి కార్యక్రమాలు మరింత ఎక్కువ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ విజయంలో మా టీమ్ సభ్యులు నాని, ప్రదీప్, సాయి, సిద్ధు నాగరాజు, శేఖర్ శాంతిరాజు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సత్తిబాబు, మోహన్, పటేల్ బాబు , ఉద్యోగస్తులు అందరికి కతజ్ఞతలు తెలిపారు. డిఎస్‌పి టిఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కవచంలాంటిది పోలీసు వ్యవస్థని దానికి పూర్తి స్థాయిలో మీ ఉద్యోగ విధిని నిర్వహించాలని కొత్తగా పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన వారికి సూచించారు. కార్యక్రమంలో చొల్లంగి అప్పాజీ, ఎస్‌సి వెల్ఫేర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, నందిక సిద్ధార్థ కుమార్, రేవు తిరుపతిరావు, తాడికోన సర్పంచ్ సాధనాల వెంకట సూర్య నాగమణి, బత్తుల రమేష్ బాబు, భయ్యా మోహన్, సాధనాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ఆటో కార్మికులకు ప్రభుత్వ పరంగా అండగా ఉండి ఆదుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆటో కార్మికులకు హామీ ఇచ్చారు. అమలాపురంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఆదివారం జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన జరిగిన ఆంధ్ర ఆటోవాలా సదస్సులో గడిచిన ఎన్నికల్లో కూటమి పార్టీలు ఆటో కార్మికులకు నెలకు 15000 ఇస్తామని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు ఈ సదస్సులో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆటో కార్మికుల కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. మోటార్ వాహన చట్ట ప్రకారం నిబంధనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని సూచించారు. కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తాను ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత భీమా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఆటో యూనియన్ సంఘాల నాయకులు కొన్ని ప్రతిపాదనలు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పించనున్న నేపథ్యంలో తమ ఉపాధికి భంగం వాటిల్లుతుందని, తమకు వృత్తి ఉపాధి రక్షణ కల్పించాలని కోరారు. ఆటో రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 20 లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారని ఆ కుటుంబాలకు బతుకు భరోసా కల్పించాలని కోరారు. అలాగే పేదరికంలో ఉన్న కుటుంబాలను ప్రభుత్వం అమలు చేస్తున్న పి-4 ద్వారా దత్తత తీసుకోని ఆర్థికంగా భరోసా ఇవ్వాలని కోరారు. ఆర్‌టిసి బస్సు సర్వీసులకు ఆటోలను అనుసంధానం చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ ఆటోలను ఎలక్ట్రికల్ ఆటోలుగా మార్చుకొని డీజిల్ ఆటోలను పరిశ్రమలు ఆయా కార్పొరేషన్ ద్వారా తీసుకుని కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి జిల్లాకు ఒక కోపరేటివ్ స్టోర్ ను ఏర్పాటు చేసి ఆటోల విడిభాగాలు తక్కువ ధరకు లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. సమస్యలపై తక్షణం స్పందించిన మంత్రి సుభాష్ సమస్యలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్ళి ఆటో కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆటో యూనియన్ నాయకులు మంత్రి సుభాష్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రా ఆటోవాలా వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు కె ఎస్ బాబు జిల్లా జనరల్ సెక్రటరీ ఊటాల వెంకటేష్, కోశాధికారి మోకా శ్రీను, అమలాపురం డివిజన్ అధ్యక్షులు బొలిశెట్టి శంకర్, సెక్రటరీ బొక్క నాని, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు పెనుముచ్చి బాబు సుకుమార్, ఆకుమర్తి సూర్యారావు, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు ముద్రగడ శ్రీనివాసరావు, 600 వందల ఆటో కార్మికులు తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మహిళా శక్తి పథకంపై మంత్రికి ఒక మెమెరండాన్ని సమర్పించారు.

పాఠశాల, కళాశాల శానిటేషన్ వర్కర్ల యూనియన్ నుంచి సత్యవేణి బహిష్కరణ

ప్రజాశక్తి - అమలాపురం

పాఠశాల, కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ విచ్ఛిన్నానికి పాల్పడినందున సత్యవేణిని సంఘం నుండి బహిష్కరిస్తున్నట్టు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సత్యవేణికి శానిటేషన్ వర్కర్స్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. వర్కర్స్ అందరూ సిఐటియు ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతామని ఈ సందర్భంగా కుసుమ పేర్కొన్నారు. శానిటేషన్ వర్కర్స్ కి ప్రతి నెల వేతనాలు చెల్లించాలని, యూనిఫామ్ ఇవ్వాలని బూట్లు, గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అందుబాటులో లేని ప్రభుత్వ వైద్యులు

పామర్రు ఆసుపత్రిలో కానరాని సిబ్బంది

ప్రజాశక్తి - రామచంద్రపురం


శనివారం రాత్రి చిన్నారితో ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి తాళం వేసి ఉన్న ఆరోగ్య కేంద్రం

పామర్రులో గల ప్రభుత్వ ఆసుపత్రిలో చాలా కాలంగా సిబ్బంది సరిగా లేక ఆసుపత్రికి వస్తున్న వారికి వైద్య సేవలు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 24 గంటలు ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఈ ఆసుపత్రిలో ఇక్కడ ఉన్న సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రి సమయంలో ఏదైనా అనారోగ్య సమస్య వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా పేదవారికి ఇది మరింత కష్టంగా మారిందన్నారు. రోజు కష్టపడి సంపాదించిన డబ్బులు ప్రయివేటు ఆసుపత్రికి వెచ్చించాల్సి వస్తోందన్నారు. సామాన్య ప్రజానికానికి ప్రభుత్వ ఆసుపత్రే దిక్కని దీనిపై ప్రజాప్రతినిధులు అధికారులు దష్టి సారించాలని కోరుతున్నారు.

తగిన వైద్యం అందడం లేదు

ఇక్కడ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. సిబ్బంది పని చేయకపోవడం వల్ల ప్రజలకు తగిన వైద్యం అందడం లేదు. శనివారం రాత్రి ఆరోగ్యం చూపించుకుందాం అని వెళ్తే బయట తాళం వేసి పోయారని, జీతాలు తీసుకుంటున్న నర్సులు, ఇతర సిబ్బంది సమయానికి విధులు నిర్వహించకపోవడం బాధాకరం. ఇది ఒక్కరోజు సమస్య కాదనీ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సమస్య. దయచేసి మంత్రి సుభాష్ ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు ఆలయాల్లో ఆదివారం దాతలు విరాళాలు అందజేశారు. వివరాలు ఇవి..

అయినవిల్లి: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి దాతలు రూ.30వేల విరాళాలు అందజేశారని ఇఒ తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన జ్యోత్స్ని మురళీధర్, కుటుంబ సభ్యులు దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరు విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాన నిధికి రూ.20, 232, అలాగే ఏలూరుకు చెందిన మొలుగు హనుమంతరావు, రాధా కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకుని నిత్యాన్నదాన నిధికి రూ. 10,000 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒఓ తెలిపారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. **ఆత్రేయపురం:** మండలంలోని ర్యాలి గ్రామంలో వెలసిన స్వయంభు పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి ఆదివారం ఆకివీడుకు చెందిన సమయ మంతుల నాగవేంకట శ్రీనివాస్ రూ.25,116, సమయమంతుల రాజ మేధా శౌరి రూ.10,116 విరాళాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి భాగవతుల వెంకట రమణమూర్తికి అందజేశారు. దాతలకు స్వామి వారి దర్శనం అనంతరం వారికి ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రం అందజేశారు.


దాతలకు విఘ్నేశ్వరుని చిత్రపటం అందిస్తున్న అర్చకులు

వికలాంగునికి ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్ బహూకరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం భీమేశ్వర స్వామి వారి ఆలయంలో వికలాంగుడైన పురోహితునికి ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్‌ను ఆదివారం ఇఒ అల్లు దుర్గ భవాని చేతుల మీదుగా బహుకరించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సహకారంతో పురోహితులు పెండ్యాల వెంకట సత్య సుబ్రహ్మణ్యంకు రూ.50 వేలు విలువగల ఎలక్ట్రికల్ మోటార్‌సైకిల్‌ను అందజేశామని ఈ సందర్భంగా ఇఒ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, పురోహితులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు


అందజేస్తున్న ఇఒ దుర్గ భవాని తదితరు లు

నవోదయ ఉచిత శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలోఅనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు మండల ప్రజా పరిషత్ ప్రధాన ఫౌండేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యాం కుమార్ స్థానిక మ్యాజిక్ హౌస్ లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చేతి వేళ్లతో ఎక్కాలను క్షణాల్లో ఎలా వేయవచ్చో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

కార్టూ'నిజం'



రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ముమ్మిడివరం



కొమానపల్లిలో ఇంటింటికీ రాజ్యాంగం కార్యక్రమం

పౌర హక్కులను పరిరక్షించే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన భాధ్యత అందరి బాధ్యత నియోజకవర్గ రాజ్యాంగ పరిరక్షణ సమితి పేర్కొంది. మండలంలోని కొమాన పల్లి పంచాయతీ పరిధిలోని మొల్లి వారి పేట గ్రామంలో ఆదివారం ఇంటింటికీ భారత రాజ్యాంగంపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజ్యాంగ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెనుమాల సుధీర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలలోని మనువాద, మతోన్మాద ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను కాలరాస్తూన్నాయని, వీటిని తిప్పి కొట్టాలంటే గ్రామాల్లోని బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలు సంఘటితమై రాజ్యాంగ పరిరక్షణకు చైతన్యవంతమైన పాత్రను పోషించాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ చదువుకున్న యువత ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి హక్కులను కల్పించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెట్టా శ్రీనివాస్, తాటిపాక దుర్గ బాబు, కుంచె చిన బాబు, శరత్, గ్రామానికి చెందిన మొల్లి అర్జున్న, సింహాద్రి, రమేష్ , యువత మహిళలు పాల్గొన్నారు.

స్నేహితుని జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని సమనస గ్రామానికి చెందిన పేరాబత్తుల కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఆదివారం సమనసలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తొలుత అమలాపురం రూరల్ మృతుడు పేరాబత్తుల కృష్ణ కుమార్తె, కుమారుడితో కలిసి సిఐ డి.ప్రశాంత్ కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ ప్రశాంత్ కుమార్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు విడనాడాలని ఆయన అన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. అనంతరం స్నేహితులు, గ్రామస్థులు ద్వారా సేకరించి పోస్టాఫీసులో జమ చేసిన రూ.1.30లక్షల డిపాజిట్ పుస్తకాలను మృతుడు కృష్ణ కుమార్తె, కుమారుని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పరమట శ్యామ్ కుమార్, ఉప సర్పంచి మామిళ్లపల్లి దొరబాబు, సొసైటీ ఛైర్మన్ సత్తి రామచంద్రరావు, మాజీ ఎంపిపి యెరుబండి వెంకటేశ్వర రావు, మాజీ సర్పంచి నడింపల్లి ఉదయబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు మామిళ్లపల్లి రాజారావు, మామిళ్లపల్లి సుబ్బరాజు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కరెళ్ల సూర్యభాస్కరరావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమనసలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

ఘనంగా రామారావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - అయినవిల్లి



రామారావు బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న గన్నవరపు శ్రీనివాసరావు

మండలంలో విలస గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు, ఎఎంసి మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ చేట్ల రామారావు పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహంలో ఈ నెల 2న రాత్రి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమనికి వైసిపి పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, అయినవిల్లి మండల అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని రామారావుతో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనను దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు కుసుమ వెంకటరమణ, పి.గన్నవరం మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు కొండేటి సురేష్ బాబు, సోషల్ మీడియా అధ్యక్షుడు ఆకుమర్తి రమేష్, మానేపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఉండ్రాజవరపు దుర్గారావు, కె.జగన్నాథపురం ఉప సర్పంచ్ ఆకుమర్తి దుర్గారావు, సవరపు దుర్గారావు, ఉప్పాటి రాజేష్, వస్కా రామారావు, నవుండ్రు రమేష్, జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు సవరపు భైరవమూర్తి, అయినవిల్లి మండలం ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు ముమ్మిడివరపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి కనకదుర్గ ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొడ్డు చినవెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొప్పాడీ తాతాజీవర్మ(19) గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై కాకినాడ వైపు వెళ్తుండగా అడ్డువచ్చిన పశువులను తప్పించబోయి అదుపుతప్పి కిందపడగా తలకు బలమైన గాయం అయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రొయ్యల కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి తల్లి, తండ్రి, ఒక చెల్లి ఉన్నారు. కుటుంబ దిక్కు కోల్పోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కోరంగి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు శివారు ప్రాంతంలో వేరువేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. ఆదివారం ఒక ప్రాంతంలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.17,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. మరో పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలవరం కాలువలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం వద్ద గల పోలవరం కాలువలో పడి ఒక మహిళ మృతి చెందింది. ఎస్ఐ రఘునాథరావు తెలిపిన వివరాలు ప్రకారం...పెద్దాపురం రాజీవ్ కాలనీకి చెందిన గడిగట్ల వరలక్ష్మి (47) తన భర్త సాయిబాబాతో రెండోవ కుమార్తె వివాహ విషయంలో గొడవపడి శనివారం బయటకు వచ్చేసింది. ఆమె కోసం సాయిబాబా వెతుకుతూ ఆదివారం జగ్గంపేటలోని వారి బంధువులు ఇంటి వచ్చారు. రామవరం కాలువలో మృత దేహం ఉందని తెలుసుకుని బయటకు తీశారు. అతని భార్య వరలక్ష్మిగా భర్త, కుమార్తె గుర్తించి బోరున విలపించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

61 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బొబ్బిలిలంకలో అక్రమంగా మద్యం సీసాలను విక్రయిస్తున్న వీరమల్ల శివను పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 61 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బొబ్బిలిలంకలో శివ తన ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించి, శివను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 61 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

వరుస చోరీలతో ప్రజల్లో భయాందోళనలు

ప్రజాశక్తి-నిడదవోలు

వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పట్టణంలో బుక్కపేటలో శనివారం రాత్రి నానుబోలు వీరేంద్ర గౌతమి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమానులు గత నెల విజయవాడ బంధువుల ఇంటికి వెళ్లారు. గత రాత్రి బాధితులు ఇంటికి చేరుకున్న సమయంలో తలుపులు పగలగొట్టినట్టు ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న 20 కాసుల బంగారం అపహరించినట్టు బాధితులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.జగన్మోహన్ రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లాయర్‌కు గాయాలు

ప్రజాశక్తి -కొవ్వూరు

ఆరికరేవుల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాళ్లపుడికి చెందిన న్యాయవాది భజంగి ప్రసాదరావు గాయాల పాలయ్యారు. తాళ్లపూడి నుంచి ఆయన మోటార్ సైకిల్‌పై కొవ్వూరు కోర్టుకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆయన రాజమండ్రి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి అందిన బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.



సత్కరిస్తున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయ కమిటీ

యాత్రికుడు నరేంద్రకు సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రం ఆలమూరు నుంచి సరస్వతీ పుష్కరాలకు మోటారు సైకిల్ పై యాత్ర చేసి మండలానికి విచ్చేసిన నిత్య యాత్రికుడు తలశిల సాయి నరేంద్ర (చౌకడే) కు చొప్పెల్ల కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘన సత్కారం నిర్వహించారు. ప్పటివరకు చౌక డే 11 పుష్కరాలకు మోటార్ వెహికల్ పై యాత్ర చేసి రావడం అభినందనీయమని కమిటీ సభ్యులు కొనియాడారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల ప్రత్యేకతను చాటే ఇటువంటి యాత్రలు పలువురికి ఆదర్శంగా వారు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి బుచ్చిరాజు, పిళ్లా నారాయణమూర్తి, సుంకర మురళి, కొత్తూరు పెదకాపు, బళ్ల బాబి, మురకొండ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇల బలోపేతానికి ర్యాంప్ పథకం

పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శ్రీవాణిధర్ రామన్



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఎంఎస్ఎంఇ అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీవాణిధర్‌రామన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు మద్దతుతో RAMP (Raising and Accelerating MSME Performance) పథకం అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక లక్ష్యాల మేరకు కార్యాచరణ అమలు చేయనున్నారు. ప్రజాశక్తి పలకరించగా ఆయన తెలిపిన వివరాలు మాటల్లోనే....

యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా

జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ఈ కార్యాచరణల కోసం అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా మంజూరు చేస్తుంది. ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలతో పాటుగా నూతన వ్యాపారాలు, మార్కెట్ లింకేజీలు లభించనున్నాయి. తద్వారా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహదపడనున్నాయి. అలాగే 'ప్రతి కుటుంబానికి ఒక ఉద్యమి' అనే లక్ష్యంతో ముందుకు సాగేందుకు ఎంఎస్ఎంఇలు కీలక భూమిక పోషించనున్నాయి.

అవగాహన కార్యక్రమాలు

కొత్తగా పరిశ్రమలు స్థాపించేందుకు ఆసక్తి కల్గిన యువతకు ఈ పథకం కింద తొలుత వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నాము. దీనిలో భాగంగా ఉద్యమ్ ఆన్‌లైన్ నమోదు నమోదు, అదేవిధంగా నైపుణ్యాభివృద్ధి కల్పించనున్నాము. నూతన ఆవిష్కరణల, కొత్త వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించనున్నాము. బ్రాండ్ పేర్లు, లోగోలు తదితర విషయాలను రిజిస్టర్ చేయించుకోవటం వంటి వాటిపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నాము.

ప్రణాళికా బద్ధంగా లక్ష్యాలు

సెప్టెంబర్ వరకు ప్రణాళికా బద్ధంగా లక్ష్యాలను నిర్దేశించుకున్నాము. తొలి యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఉద్యమ్ నమోదుకు 16 కార్యక్రమాలను, అదే విధంగా నైపుణ్యాభివృద్ధి



శిక్షణా కార్యక్రమాలను 18 నిర్వహించనున్నాము. అదేవిధంగా ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టం, మేథస్సు స్వత్తుల హక్కులపై అవగాహన జెడ్ఇడిపై 10 కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలను రూపొందించాము. ఈ కార్యక్రమాల అనంతరం అవసరమైతే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తాము.

జీరో డిఫెక్ట్ ఎఫెక్ట్- జీరో డిఫెక్ట్ ప్రమాణాలు

ఎంఎస్ఎంఇలను ప్రోత్సహించటంతో పాటు ఉత్పత్తుల నాణ్యతను మెరుగు పర్చేందుకు, పర్యావరణానికి హానికరం కాకుండా తయారు చేసే విధానాలను వివరించనున్నాము. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ZED (ZeroEffect,ZeroDefect) ప్రమాణాలపై కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను రూపొందించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించనున్నాము. కలెక్టర్ ఆదేశాలతో ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖతో పాటు వివిధ శాఖలు భాగస్వాములు కానున్నాయి.

హక్కులను హరించే జిఓను రద్దు చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించేలా విద్యా శాఖ విడుదల చేసిన జిఒను తక్షణమే ఉపసంహరించుకోవావాలని పిడిఎస్‌యు(విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రామవరం రంగవల్లినగర్‌లో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లోకి ఎస్‌ఎంసి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా మరేయితరులను అనుమతించరాదని విద్యా శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు దారుణమన్నారు. ఈ జిఒ ద్వారా విద్యార్థుల నోరునొక్కే ప్రయత్నం అవుతుందన్నారు. ఇటువంటి వైఖరి సరైంది కాదన్నారు. పాఠశాలల్లో నెలకున్న సమస్యలు, ప్రయివేటు విద్యా సంస్థల వ్యాపారాన్ని, అన్యాయాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. ఈ జిఒ ద్వారా ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీకి అండగా నిలవడమేనని అన్నారు. తక్షణమే విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, లేకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం కార్యదర్శిగా శంకర్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చందుర్తి గ్రామానికి చెందిన యనమల శంకర్ సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం పిఠాపురం నియోజకవర్గ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి వర్గీయులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

వాన రాదాయే..ఖరీఫ్ కష్టమాయే...

వర్షాల కోసం ఎదురుచూపులు
ఇటీవల కురిసిన వర్షాలతో దుక్కులు, నారుమళ్లు పూర్తి
కేవలం 400 ఎకరాల్లోనే నాట్లు



ప్రజాశక్తి - జగ్గంపేట

మెట్ట ప్రాంతంలో ఈ ఏడాది వరుణుడు కరుణిస్తేనే ఖరీఫ్ సాగు అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వరుణుడు దోబూచులాడుతున్నాడు. ప్రస్తుత వర్షాకాలంలో రోజు ఏదోక సమయంలో వర్షం పడాల్సి ఉంది. కానీ ప్రస్తుత వాతావరణం వేసవిని తలపించేలా ఉంది. గత వారం రోజుల క్రితం తుపాను ప్రభావంతో వర్షాలు కురవడంతో ఆ వర్షాలకు రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధపడి దుక్కులు దున్నారు. ఆలాగే కొన్ని చోట్ల నారుమళ్లు వేశారు. నారు పోసిన తరువాత ఎండలు విపరీతంగా ఉండటంతో నారుమళ్లు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జులై నెలాఖరు నాటికి గత ఏడాది మండలంలో 1700 ఎకరాలు సాగు ఐతే ఈ ఏడాది 400 ఎకరాలకే పరిమితమైంది. వచ్చే 15 రోజుల్లో వర్షాలు కురిస్తే ఎదజల్లి ఖరీఫ్ సాగు చేద్దామనే ఆలోచనతో రైతులు ఉన్నారు. వర్షాలు రాకపోతే ఖరీఫ్ ఈ ఏడాది స్వస్తి చెప్పి అపరాలు సాగుకే రైతులు పరిమితం అయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి.

ఆగస్టు నెలాఖరు వరకు చూస్తాం

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వరి సాగు బాగా తగ్గింది. గత ఏడాది 9312 ఎకరాల్లో వరి సాగు అయ్యింది. ఐతే ఈ వారంలో వర్షాలు పడితే నారుమళ్లు వేసినవారు నాట్లు వేస్తారు. అలాగే మిగిలిన వారు ఎద జల్లుతారు. అలా నెలాఖరు నాటికి 6 వేల నుంచి 7 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నాం.

- నరసింహం, మండల వ్యవసాయ అధికారి

ఏలేరు ఆయకట్టులోనే సాగు

మండలంలోని కాట్రావులపల్లి, జగ్గంపేట, రామవరం గ్రామాల్లో ఏలేరు ఆయకట్టు ఉంది. ఆ గ్రామాల్లో ఏలేరు ద్వారా నీరు రావడంతో ఖరీఫ్ సాగు చేశారు. ఐతే ఏడాది గత ఏడాది కంటే తక్కువ అనే చెప్పాలి. గత సంవత్సరం ఈ సమయానికి సుమారు 1500 ఎకరాల్లో సాగు ఇతే ఈ సంవత్సరం 260 ఎకరాలకే పరిమితం అయ్యింది. ఆది కూడా సాగు తగ్గింది.

పుష్కర నీరు రాకతో వరిసాగు

తోట వెంటచలం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా పుష్కర నీరు రావడంతో మండలంలోని రైతులు వరి సాగుకు అలవాటు పడ్డారు. గతంలో పుష్కర రాక ముందు మండలంలోని జె. కొత్తూరు, రాజపూడి, వెంగయమ్మపురం, మల్లిశాల, మన్యం వారిపాలెం, గోవిందపురం, కాండ్రేగుల, గొల్లల గుంట, గుర్రంపాలెం, గ్రామాల రైతులు మెట్ట పంటలైన దుంప, అపరాలు, నువ్వులు సాగు చేసేవారు. పుష్కర కాలువ రావడంతో ఎగువ గ్రామాలకు నీరు అందేలా తాళ్లూరు వద్ద పంపు హౌస్ ఏర్పాటు చేయడం జరిగింది. ఐతే పంపు హౌస్ నుంచి నీరు కాలువ ద్వారా కాకుండా పైపు లైన్ల ద్వారా వెళ్ళే విధంగా నిర్మించారు. కొన్నేళ్ల ఆ పైపులైన్లు పని చేయడంతో మెట్ట గ్రామాలకు నీరు అందేది. అలా అప్పటి నుంచి మెట్ట రైతులు దుంప, అపరాల పంటలు మాని వరిని సాగు చేయడం మొదలు పెట్టారు. గత కొన్నేళ్లుగా మెట్ట రైతులు వరికి అలవాటు పడిపోయారు. ఐతే ఆ నీరు అందించే పుష్కర పైపులైన్లు మరమత్తులకు గురికావడంతో గత ఐదేళ్లుగా వర్షాలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. ఐతే ఈ ఏడాది ఆగస్టు నెల వచ్చినా వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక పిఆర్ బాలుర హైస్కూల్ 1996-97లో 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డైరక్టర్ పి.శ్రీనివాస్, విశ్రాంత హెచ్ఎం భారతి, పూర్వ అధ్యాపకులు కాంతారావు, మల్లేశ్వరరావు, సూర్యకాంతం, పి.రమేష్, జి.నాగమణి, పి.వేణు గోపాలరావు, ఎవిఎస్‌కెవి.ప్రేమజ్యోతి, షకీలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆడిన ఆటలు, పాటలు అలరించాయి.

సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి - కిర్లంపూడి

ముక్కోలు సచివా లయంలో విధులు నిర్వర్తించి బదిలీ అయిన సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక సచివాలయం వద్ద జరిగిన సత్కార కార్యక్రమానికి సర్పంచ్ జ్యోతుల రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మండల మాజీ ఎంపిపి గోపు అచ్యుతరామయ్య, నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



ఇంటింటి ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల కలిగే అనర్ధాలను వివరిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం జరిగింది. ఆదివారం మండలంలోని ఎండపల్లి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అనేక నష్టాలు ఉంటాయని వివరించారు. స్మార్ట్ మీటర్లు రీఛార్జ్ అయిపోతే తర్వాత కరెంటును పునరుద్ధరించడానికి చాలా సమయం పడుతుందని తెలిపారు. పెద్దఎత్తున విద్యుత్ ధరలు పెరిగిపోయే ప్రమాదం ఉందని వివరించారు. స్మార్ట్ మీటర్లను వినియోగదారులు అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, కెవిబి.సత్యనారాయణ, సిహెచ్.సాంబశివకుమార్, బి.గంగాధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎసి విజయలక్ష్మికి ఘన సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించినందుకు ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మిని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఆమెను పూలమాలలు, సాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఓబిలిశెట్టి గణేష్, కందుల వెంకటచలం, ఊలపల్లి రామకృష్ణ, బెందులూరి స్వామి, సకురి కనకారావు, తిపనగిరి చంద్రముఖి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన మణికంఠకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంకకి చెందిన పాలూరి విజయ మణికంఠ ఇటీవల విడులైన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతనిని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు శాఖలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వారు సూచించారు. దీంతో మణికంఠను పూలమాలలు, శాలువాలతో ఆదివారం వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ టిడిపి నాయకులు పాలూరి గోవిందరాజు, దూలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వద్దిపర్రుకు చెందిన మాధవ్‌కు ..

ఆత్రేయపురం: మండలంలోని వద్దిపర్రు గ్రామానికి చెందిన యువకుడు ఇసుక పట్ల మాధవ్ ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ నియామకల్లో ఫలితాల్లో ఎంపికయ్యాడు. ఇసుకపట్ల మాధవ్ డిగ్రీ వరకు చదివి 2019 నుంచి అనేక పరీక్షలు రాసినప్పటికిని పట్టు విడవకుండా పోలీస్ అవ్వాలని పట్టుదలగా చదివి కానిస్టేబుల్ గా ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్తులు యువకుడిని అభినందించారు. యువత మాధవను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తపనతో ముందుకెళ్లిన ఆ యువకుడిని ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు అన్నారు..

అర్హురాలికి అందని పింఛన్

ప్రజాశక్తి - కాట్రేనికోన

పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మూడేళ్లు కావస్తున్నా భర్త చనిపోయిన అర్హురాలైన మహిళకు వింతతు పింఛన్ అందలేదు. దొంతికుర్రు గ్రామానికి చెందిన చిట్టూరి సత్యనారాయణ 2022 సంవత్సరం డిసెంబర్ నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. అతని భార్య రమాదేవి తన భర్త పేరున ఉన్న వృద్ధాప్య పింఛన్ స్థానంలో తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని అప్పటినుండి గ్రామ సచివాలయానికి తిరగని రోజంటూ లేదు. అయినా అక్కడ పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు రెండు దరఖాస్తులు చేసుకుంది. అయతే ఏడాది పాటు రేషన్ కార్డులో భర్త పేరు తొలగించ లేదంటూ తిప్పుకున్నారు. తర్వాత మీకు కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందంటూ కొన్నాళ్ళు, మళ్లీ కరెంట్ బిల్లు తక్కువ వచ్చిందంటూ అర్థం పర్థం లేని కారణాలు చెబుతూ రెండేళ్లకు పైగా తిప్పుకున్నా ఫలితం లేదు. చివరకు బాధితురాలు రమాదేవి ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును




చిట్టూరి రమాదేవి

ఆశ్రయిం చింది. అయితే ఎంఎల్ఎ అధికారులను ఆదేశించినా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలో ఈ ఏడాది ఆగస్టు ఒకటిన వితంతు పింఛన్‌లు మంజూరు చేసిన 196 మంది జాబితాలోనూ ఆమె పేరు లేదు. దీంతో నిరాశ చెందిన బాధితురాలు రమాదేవి ఇన్నేళ్లు అయినా తనకు పెన్షన్ ఎందుకు రావడం లేదని సచివాలయం అధికారులను ప్రశ్నించింది. ఈ ఏడాది జూన్ 26న మీ పెన్షన్ ఆన్లైన్ చేసిన సమ యంలో మీ భర్త డెత్ సర్టిఫికెట్ అప్లోడ్ చేయని కారణంగా పెన్షన్ మంజూరు చేయలేదని చెప్పారు. ఎన్నోసార్లు డెత్ సర్టిఫికెట్ కూడా కూడా ఇచ్చానని, లేకుంటే తనకు సమాచారం అందించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రస్తుతం కూడా పింఛన్ మంజూరు కాలేదని ఆమె వాపోయింది. అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకుని అర్హురాలైన తనకు న్యాయం చేయాలని ఆమె విన్నవించింది.

సొసైటీ అధ్యక్షునిగా పడాల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - మండపేట



ఎంఎల్ఎ వేగుళ్లను సన్మానిస్తున్న పడాల రామకృష్ణారెడ్డి

మండపేట మండలం తాపేశ్వరం శ్రీ వల్లూరి కాశీ విశ్వనాథం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) అధ్యక్షునిగా పడాల రామకృష్ణారెడ్డి, నూతన కమిటీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షులుగా అర్తమూరు గ్రామానికి చెందిన పడాల రామకృష్ణారెడ్డి, డైరెక్టర్లుగా ఓలిపల్లి వెంకటరమణ, చీకట్ల గోవిందరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళ వారికి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ, తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. తొలుత ఎంఎల్ఎ వేగుళ్లను సొసైటీ అధ్యక్షులు పడాల రామకృష్ణారెడ్డి దుశ్శాలువాతో సత్కరించి, మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మండల అధ్యక్షులు కర్రి తాతరావు, మాజీ అధ్యక్షులు యరగతపు బాబ్జి, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పెనుగుదురు సొసైటీ ఛైర్మన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు పిఎసిఎస్ ఛైర్మన్‌గా రెడ్డిపల్లి నారాయణరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పంతం నానాజీ, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, పాల్గొని రెడ్డిపల్లి నారాయణరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పంతం నానాజీ మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కృషి చేయాలని. సొసైటీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాలను రైతులకు అందించాలన్నారు. ఛైర్మన్



ప్రమాణ స్వీకారం చేసిన రెడ్డిపల్లి నారాయణరావు

నారాయణరావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టిడిపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనువాస్ బాబా, మాజీ జడ్‌పిటిసి సభ్యులు నూరుకుర్తి వెంకటేశ్వరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి: ఎంఎల్ఎ నానాజీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం గంగనాపల్లి గ్రామంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో 90 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు ఎంఎల్ఎ పంతం నానాజీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ద్వారా రూరల్ మండలంలో 27 వాటర్ ట్యాంక్‌లు మంజూరు అయ్యాయని తెలిపారు. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతర ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ కల్యాణ మండపంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారిపై గోతుల పూడ్చివేత

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

చిందాడగరువు గ్రామం సిద్ధి బుద్ధి వినాయకుని ఆలయం వద్ద రోడ్లుపై గోతులు ఉన్నాయి. స్థానిక ఎంపిటిసి సభ్యుడు మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు రూ.5 వేలు తన సొంత నిధులను ఖర్చు చేసి మెటీరియల్స్ ఉపయోగించి ఆదివారం ఈ గోతులను పూడ్చారు. ఎంపిటిసి భర్త అయిన వెంకటేశ్వరరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు, అధికారులు ఆయనను అభినం దిస్తున్నారు. కార్యక్రమంలో కోలిశెట్టి నాగబాబు, కుంపట్ల శ్రీను,రంకిరెడ్డి నాగు,రంకిరెడ్డి శంకరం,మాదిరెడ్డి స్వామి, మండేలా గోపి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజమండ్రి 10వ అదనపు జిల్లా జడ్జి (SC&ST) వారి కోర్టులో
E.P.2/2015 in OS.No.79/2010

Between:-
హనుమంతు విఘ్నేశ్వరరావు అనే గణేష్ ...డి. హెచ్.ఆర్
అండ్
మునుకుట్ల నాగ ఆదిత్య ...జె.డి.ఆర్

టు.
మునుకుట్ల నాగ ఆదిత్య, తండ్రి,(లేటు) నాగేశ్వర శ్రీనివాసరావు, డోర్‌నెంబరు.6-3-6/10, ఫ్లాట్ నెం.జి-1, కోడూరి ప్లాజా.చల్లపల్లి వారి వీధి, ఇన్నీసుపేట, రాజమండ్రి.

నోటీసు

సదరు పై నెంబరు E.P లో మీకు ఎన్నిమార్లు OR21 RULE 64&66 CPC నోటీసులు పంపించినను, మీరు తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. దాని కారణంగా శ్రీ కోర్టు వారు మీకు నోటీసు"ప్రజాశక్తి" పత్రికలో ప్రచురించుటకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున మీకు నోటీసు ప్రజాశక్తి డెయిలీ లోకల్ న్యూస్ పేపర్ తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్ పత్రికలో ప్రచురించి పై E.P కేసు **ది.25-08-2025** సం॥తేదిని వాయిదా అయి వున్నది. అని మీకు ఈ పత్రికా ముఖంగా తెలియ చేయడమైనది. సదరు వాయిదా రోజున మీరు కోర్టుకు ఉదయం **10.30ని॥లకు** మీరు స్వయంగా గాని, వక్కీలు ద్వారా గాని, హాజరు అయ్యి మీ ఆక్షేపణలు కోర్టు వారికి తెలియ చేసుకోవలయును. సదరు వాయిదా తేదీన మీరు కోర్టుకు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించ బడును.

క్రొవ్విడి వెంకటరావు
రాజమండ్రి డి. హెచ్.ఆర్.తరపు,న్యాయవాది
02-08-2025 సెల్.9440254625

IN THE COURT OF THE 9th ADDITIONAL DISTRICT JUDGE KOVVUR
O.S.No.53/2017

Between:-
1. శ్రీ చట్టి బదరి నారాయణ కోనేరు(డైడ్)
2. శ్రీ చట్టి శ్రీనివాస్ వగైరాలు ...వాదులు

మరియు

శ్రీ చట్టి సర్వోత్తమ(డైడ్)
శ్రీమతి బిదుగు దేవికారాణి వగైరా ...ప్రతివాదులు

To

5వ ప్రతివాది:- చట్టి మాణిక్య హనుమంతరావు, S/o.లేటు వెంకటకృష్ణ, వయస్సు 54 సంవత్సరాలు, ఉద్యోగి, విజ్జేశ్వరం, నిడదవోలు మండలం, తూర్పుగోదావరిజిల్లా, నిడదవోలు JCJCJ

పై నెంబరు దావా O.S.No.53/2017 లో దావా సంగతులు తెలియజేయు నిమిత్తం 5వ ప్రతివాది కి శ్రీ కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు దావా సమన్లు పంపినప్పటికి సదరు 5వ ప్రతివాది బుద్ధి పూర్వకముగా ఎవైడ్ చేయుచున్న కారణంగా శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా దావా సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు దావాలో మీకు ఏమైనా అభ్యంతరములు వున్న యెడల **ది.19-08-2025వ** తేదీన ఉదయం **10.30ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైన ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చు కోవచ్చును. లేనియెడల వారి పరోక్షమున తీర్మానించచడమగునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

వాయిదా.19-08-2025

అత్మూరి సత్యన్నారాయణ
వాదితరపు అడ్వకేట్
కొవ్వూరు,తూ॥గో॥జిల్లా
కొవ్వూరు
ది.28-07-2025 సెల్.9849847197